ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేత


జేసీబీతో ఆక్రమణలను తొలగింపజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : ప్రధాన రహదారిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై సోమవారం ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం కొరడా ఝులిపించింది. రామంతాపూర్ అంతర్గత రోడ్లలో పాదాచారులు నడిచే రహదారిని కొంత మంది కబ్జాలు చేసి చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చుకుంటున్నారని వాటిని కూడా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన రాజు, సునీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం కాప్రా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్ ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ నుంచి మల్లాపూర్ శివహోటల్ చౌరస్తా వరకు


మల్లాపూర్‌లో..

ఫుట్‌పాత్ ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలు, రేకుల షెడ్లను నేలమట్టం చేశారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ న్యాక్ ఇంజినీర్లు యోగి, అశ్విని, చైన్‌మెన్‌లు రాజు, గంగాధర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎట్లా బతకాలి.. ?

నోమా ఎదురుగా గోకుల్‌నగర్‌కు చెందిన కస్తూరి బాయి అనే మహిళ గత 15 ఏళ్లుగా డబ్బా ఏర్పాటు చేసుకుని చెప్పుల దుకాణం నడిపిస్తుంది. ఆమె డబ్బాను తొలగిస్తుండగా అడ్డుకుని, తాను ఎట్లా బతకాలని చేతులు జోడించి విలపించింది. కేసీఆర్ ఎక్కడా ఉన్నా రావాలని వేడుకుంది.


తాత్కాలిక షెడ్డులను నేలమట్టం చేసిన దృశ్యం

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గం..

ఆక్రమణలను ఉపేక్షించేది లేదన్న జెడ్‌సీ


జెడ్సీకి వినతిపత్రం అందజేసిన పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రిపురం చౌరస్తా వరకు ప్రధానరోడ్డు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. జెడ్సీ ఆదేశాల మేరకు ఇటీవల ప్రధాన రోడ్డు వెంట ఉన్న వ్యాపారుల షెడ్లను కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'మా బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారిదంటూ'.. వ్యాపారులు కార్పొరేటర్ శ్రీదేవి, కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డితో గోడు వెల్లబోసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం వారు చిరు వ్యాపారులతో కలిసి ఎల్‌బీనగర్ జెడ్‌సీ హేమంత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యాపారులకు ఊరట కల్పించాలని జెడ్‌సీని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చర్లపల్లి రైల్వే టర్మీనల్ ప్రారంభం కానుందని భవిష్యత్తులో ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. వ్యాపారులకు అనువైన స్థలం ఏదైనా ఉంటే చూపితే మోడల్ మార్కెట్ ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గం చూపేందుకు తన పూర్తి సహకారం అందజేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో షెడ్డులు తిరిగి వేయకూడదని వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చూస్తామన్నారు.

గడ్డి అన్నారం మార్కెటింగ్ డైరెక్టర్‌గా రఘుపతిరెడ్డి



ఉప్పల్: ఉప్పల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి గడ్డి అన్నారం మార్కెటింగ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. తనకు సహకరించిన నేతలకు కృతజ్ఞతలు చెప్పారు.

దోబీ పోస్టులు రజకులకు కేటాయించాలి



అల్వాల్: ఓల్డ్ అల్వాల్ దోబీఘాట్‌లో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షులు సీఎల్, యాదగిరి హాజరై మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. 70 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ వేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దోబీ పోస్టులు పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కే.డీ. రమేష్, రాజయ్య, రంగారెడ్డి, వెంకటేష్, విజయ్, ఐలయ్య, సాంబయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పట్నం మహేందర్‌రెడ్డిని కలిసిన స్థానిక నేతలు


శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కాప్రా: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఏఎస్ రావునగర్ డివిజన్ కాంగ్రెస్ నేతలు కలిశారు. సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కొత్త అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవరెడ్డి, పెద్దనాగరాజు, సునీత, సత్యనారాయణ వల్లభనేని శేఖర్, మొగులయ్య, పాకాల రాజు, గిరిబాబు, గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో టీజీవో అసోసియేషన్ ప్రతినిధుల భేటీ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను నూతనంగా ఎన్నికైన జిల్లా టిజీవో అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అర్హులైన పేద ప్రజలకు సర్కారు పంపిణీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు వారి దరికి చేర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన వారిలో టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, కార్యదర్శి, డాక్టర్ కురుమూర్తి, అసోసియేషన్ జిల్లా ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు వెంకటేశం, విజయ కుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్ గౌడ్, విష్ణువర్ధన్‌రావు, అర్చన, ఆనందరావు, కరుణాకర్‌రెడ్డి, రమేష్, సత్యనారాయణ, సాయికృష్ణ, నాగమణి, శంకరయ్య, శ్యామల, నాయుడు, స్వాతి, డాలి తదితరులు పాల్గొన్నారు.

చుట్టపుచూపుగా వచ్చి అనంత లోకాలకు..!

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన ఓ వ్యక్తి మరణించిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ కేపాల్‌లో నివసించే చత్తీస్‌ఘడ్‌కు చెందిన బిహారి లాల్ ఇంటికి అతడి కుమారుడు రోహిత్, బావమరిది సీతులాల్‌భారీహ(48)తో కలిసి చత్తీస్‌ఘడ్ నుంచి ఈ నెల 21న వచ్చారు. అదే రోజు రాత్రి భోజనం అనంతరం అందరూ నిద్రకు ఉపక్రమించారు. ఉదయం లేచి చూసే సరికి సీతు లాల్ భారీహ మరణించి ఉన్నాడు. దీంతో అందరు భయపడి ఇతరులకు చెప్పలేదు. సోమవారం వారు ఇంటి యజమాని నరసింహకు చెప్పగా అతడు పోలీసులు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల వివరాలు సేకరించారు. అనారోగ్యంతో మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. బిహారి లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు ఢీకొని గాయపడ్డ యువకుడి మృతి

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మరణించిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... అవుషాపూర్‌లో నివాసముండే ఉత్తరప్రదేశ్‌క చెందిన రిజ్వాన్ అలీ(23) సోమవారం ఉదయం 5 గంటలకు స్థానిక తీన్మార్ హోటల్ సమీపంలో వంతెన వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు రిజ్వాన్ అలీని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాన శిబిరం


సర్టిఫికెట్ ప్రదానం చేస్తూ..

మల్కాజిగిరి: రక్త దానం అన్ని దానాల్లో కన్న గొప్పదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజెవైఎం ఆధ్వర్యంలో మల్కాజిగిరి డివిజన్ ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు సేవాకార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. సుమారు 41 మందికి సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నాయకులు ప్రభాకర్, డీఎస్. వెంకటేష్, వీకే. మహేష్, వాశంశెట్టి, శ్రీనివాస్, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్‌లో ఎస్ఎస్ గార్డెన్‌లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవ మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎంపీ ఈటల ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్.రామచంద్రరావు, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ డీఎస్ వెంకటేష్, బీజేవైఎం నాయకులు సంతోష్‌గౌడ్, హృకేష్, దినేష్, పవన్, రుత్విక్, సీనియర్ నాయకులు వీకే. మహేష్, మాణిక్‌రెడ్డి, ఓంప్రకాష్, బాల్‌చందర్‌గౌడ్, జగదీష్‌గౌడ్, జగదీష్‌చారి, ముఖ్యనేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్ఎస్‌గార్డెన్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

పర్యాటక దినోత్సవం అవగాహన ర్యాలీ



అల్వాల్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కొకూర్ జెనెసిస్ పాఠశాలలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజ మాట్లాడుతూ.. భారతదేశం పర్యాటక రంగంలో ప్రపంచాన్నే ఆకర్షితులను చేస్తుందన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలో అన్ని రంగాల వారిని ఆకట్టుకునేలా వందలాది పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. కరస్పాండెంట్ మోసెస్, మహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పల్: ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి పడిఉన్నాడని 100కు ఫోన్ చేసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు హోమ్‌కు వృద్ధుడు!

- గత 4 రోజులుగా కుషాయిగూడ బస్‌స్టాప్‌లోనే..
- అండగా నిలిచిన మన స్నేహం ఫౌండేషన్ ప్రతినిధులు


స్థానికుల సాయంతో హోమ్ తరలిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: గత 4 రోజులుగా కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద ఉన్న ఓ వృద్ధుడిని ఎట్టకేలకు సోమవారం హోమ్‌కు తరలించారు. గమనించిన స్థానిక కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అతడితో మాట్లాడి అచూకీ కోసం ప్రయత్నించగా.. ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో దుప్పట్లు, భోజనం ఏర్పాట్లు చేసి చేరదీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఏదైనా హోమ్‌కు తరలించాలని కోరినట్లు వివరించారు. సామాజిక మాధ్యమాలతో విషయం తెలుసుకున్న 'మన స్నేహం' ఫౌండేషన్ ప్రతినిధులు రేగళ్ల సతీష్‌రెడ్డి, కావేరి, సిరి స్పందించారు. ఈ సెకండ్ చాన్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో మాట్లాడి వృద్ధుడిని హోమ్ తరలించారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచాలి

ఘట్‌కేసర్: పట్టణంలోని కేఎల్లార్ నగర్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 100 కేవీ నుంచి 160 కేవీకి పెంచాలని మాజీ వార్డు సభ్యుడు కొత్తకొండ వెంకటేశ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌ను సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. లో ఓల్టేజీ కారణంతా విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్నారు. కాలనీకి సరఫరా చేసే లైన్ ఇండస్ట్రియల్ ఫీడర్ ఉన్నందున తరచూ కోతలు విధిస్తున్నారన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు


పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 13, 17 డివిజన్‌లలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. అపరిశుభ్ర ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి, నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేసినట్లు వెల్లడించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలను నివారించేందుకు చెత్త చెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ అనితాయాదగిరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వంగుప్తా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.90 లక్షలతో అభివృద్ధి పనులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ గీత, జీహెచ్‌ఎంసీ అధికారులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీఆర్ఎంపీ నిధులు రూ. 2.90 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. చిలుకానగర్ డివిజన్ కల్యాణపురి ప్రధాన రహదారి నుంచి టీచర్స్ కాలనీ వరకు దాదాపుగా 1.5 కిలో మీటర్ల సీసీరోడ్డును వేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డివిజన్ పరిధిలో చేపట్టిన పలు అంతర్గత రోడ్లు, శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం లాంటి వాటికి కూడా శంకుస్థాపన చేశారు. దశల వారీగా నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీసీరోడ్లతో పాటు సీవరేజ్ లైన్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఈఈ నాగేందర్, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ , బాల్‌రెడ్డి, విభి నర్సింహా, జల్లీ మోహన్, పల్లె నర్సింగ్‌రావు, జగన్, మాస శేఖర్, పిట్టల నరేష్, బాల్‌రెడ్డి, రామాంజనేయులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి తన సాయశక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాప్రా డివిజన్‌లోని జనప్రియ కాలనీలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కలిసి రూ. 72 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక నేతలు ఎంకే. బద్రోద్దీన్, భైరి నవీన్‌గౌడ్, ఇంద్రయ్య, శ్రీకాంత్, కొండల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కాప్రా డివిజన్‌లో..

ఉత్తరప్రదేశ్ సీఎంను కలిసిన స్థానిక నేతలు


యోగి ఆదిత్యనాథ్‌తో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ శ్రవణ్

మౌలాలి : ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ నివాసంలో గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, ప్రజల కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని యోగి చెప్పారన్నారు.

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ మర్యాదపూర్వకంగా ఉత్తరప్రదేశ్ సీఎంను కలిశారు. వన్ నేషన్ వన్ ప్రొడక్ట్, గోమతి నది రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై యోగి వివరించారన్నారు.

శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మొగులయ్య

మౌలాలి : మౌలాలి డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లోని ఎస్సీ శ్మశానవాటికలో చాలా కాలంగా ఎవరూ పట్టించుకోకపోవడంతో భారీగా చెట్లు పెరిగాయని, శ్మశానవాటిక లోపలికి వెళ్లేదారి కూడా మూసుకుపోయిందని ఎమ్మెల్యేకు భారతమాత భజన మందిరం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థానిక బల్దియా ఏఈ మధురిమతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మొగులయ్య, భిక్షపతి, లక్ష్మణ్ తదితరులున్నారు.

'సైన్ లాంగ్వేజ్' ఓ ప్రత్యేక ప్రపంచం



అల్వాల్: నేరేడ్‌మెట్ ఆర్‌కే.పురంలోని హెలెన్ కెల్లర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్నేషనల్ సైన్ లాంగ్వేజ్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత జస్టిస్ బాషా నవాజ్‌ఖాన్, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ హాజరై విద్యార్థులచే సైన్ లాంగ్వేజ్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ నవాజ్‌ఖాన్ మాట్లాడుతూ.. సైన్ లాంగ్వేజ్ ఓ ప్రత్యేక ప్రపంచమని, ఎలాంటి శబ్దాలు లేకుండా కేవలం సైన్‌లతో బోధన జరిపి విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ చైర్మన్ పఠాన్ ఉమ్మర్‌ఖాన్ తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలిపెట్టి విద్యార్థుల సేవకు అంకితమై ఎంతో సేవచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోయినా 850 మంది విద్యార్థులకు చాలీచాలని గదుల్లో దాదాపు రూ.5 లక్షల అద్దెను ప్రతినెల చెల్లించుకుంటూ.. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం నుంచి పాఠశాలకు తగిన ప్రభుత్వ భూమిని కేటాయించడానికి కృషి చేస్తానన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి



కాప్రా: కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఎస్‌రావు నగర్ డివిజన్ కమలానగర్‌లోని పార్టీ కార్యాలయం నీల రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశంలో కులగణన చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణన చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కుల కోసం పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ నేతలు దామోదర్‌రెడ్డి, రొయ్యల కృష్ణమూర్తి, లక్ష్మి, తిరుపతి, బాపిరాజు, జంగయ్య, సూర వెంకటయ్య, రమణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు వ్యాక్సినేషన్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని పెంపుడు కుక్కలు, జంతువుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ (ఏఆర్‌వీ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. బ్లూ క్రాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యాక్సినేషన్ డ్రైవ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు.